క్లుప్తంగా

విద్యార్థుల ఇక్కట్లు



జమ్మానిపల్లిలో బస్సు కోసం వేచి ఉన్న విద్యార్థులు

మడకశిరరూరల్: ఆర్టీసీ బస్సు సమయానికి రాకపోవడంతో మడకశిరలోని కళాశాలలు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తమ గ్రామానికి 8 గంటలకు రావాల్సిన ఆర్టీసీ బస్సు వారం రోజులుగా 8.50 గంటలకు వస్తోందని జమ్మానిపల్లి గ్రామానికి చెందిన విద్యార్థులు వాపోయారు. బస్సు సకాలంలో రాకపోవడంతో రోజూ తరగతులకు గైర్హాజరవుతున్నామన్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు సమయానికి బస్సు నడిపేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఇదిలా ఉండగా పాఠశాల సమయానికి ఆర్టీసీ బస్సు నడపాలని కోరుతూ జమ్మానిపల్లి గ్రామస్తులు గురువారం స్థానిక ఆర్టీసీ అధికారులకు వినతి పత్రాన్ని అందించారు.

ఘనంగా శ్రీకృష్ణుడి ప్రతిమ ఊరేగింపు



శ్రీకృష్ణుడి ప్రతిమ పల్లకీలో ఊరేగిస్తున్న దృశ్యం

హిందూపురం: శ్రీకృష్ణ జన్మాష్టమి ఉత్సవాల్లో భాగంగా గురువారం ముదిరెడ్డిపల్లిలో ప్రబోధ సేవాసమితి ఆధ్వర్యంలో శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ఘనంగా ఊరేగించారు. ఈసందర్భంగా శ్రీకృష్ణుడి పర్తిమను పల్లకీలో ఉంచి భక్తుల జనుల మధ్య మేళతాళాలు, భగవద్గీత శ్లోకాల పఠనం నడుమ ఊరేగింపు చేపట్టారు. త్రైత సిద్ధాంతం ప్రబోధ సమితి, ఇందూ జ్ఞాన వేదిక కమిటీ అధ్యక్షులు ఆదినారాయణ సభ్యులు శేఖర, మునీంద్ర, కిష్టప్ప, సింధు, మంగళ గౌరీ, రామ్మోహన్, గోవర్దన్, రవి, శ్రీనివాసు, భాస్కర్, భార్గవి, గౌతమి, సంధ్య, మమత, పార్వతి, సరస్వతి, లీల, సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

విపత్తు నిర్వహణ సామగ్రి అందజేత

పావగడ: స్థానిక రామకృష్ణ సేవాశ్రమాధిపతి జపానంద స్వామి బెళగావి జిల్లా కలెక్టర్ మహ్మద్ రోషన్‌కు గురువారం విపత్తు నిర్వహణ సామగ్రిని అందజేశారు. ఇన్ఫోసిస్ ఫౌండేషన్ సహకారంతో అత్యాధునిక యంత్రోపకరణాలు, రెయిన్ కోట్లు, గంబూట్స్, గొడుగులు, చెట్టు కొమ్మలను కత్తిరించే యంత్రాలను అందించినట్లు స్వామి జపానంద తెలిపారు.


మున్సిపల్ చైర్మన్ బాధ్యతల స్వీకరణ



చైర్మన్, వైస్ చైర్ పర్సన్‌ను అభినందిస్తున్న దృశ్యం

పావగడ: స్థానిక మున్సిపల్ నూతన చైర్మన్ పీహెచ్ రాజేశ్, వైస్ చైర్ పర్సన్ గీతా హనుమంతరాయప్ప గురువారం వారి కార్యాలయాల్లో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వారిని పలువురు అభిమానులు ఘనంగా సన్మానించి అభినందించారు. చైర్మన్ రాజేశ్ మాట్లాడుతూపట్టణాభివృద్ధికి శక్తి వంచన లేకుండా పాటు పడతానన్నారు. ఎలాంటి అంతరాయం లేకుండా ఇంటింటికీ నీరు సరఫరా చేస్తామన్నారు. డ్రైనేజీల శుభ్రత, రోడ్ల నిర్మాణాలు, పేదలకు గృహ సౌకర్యం కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తానన్నారు. కేఎస్ ఆర్టీసీ నూతన బస్టాండు ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు.

మున్సిపల్ నూతన భవనం ప్రారంభం



భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకటేశ్

పావగడ: స్థానిక మున్సిపల్ నూతన భవనాన్ని ఎమ్మెల్యే వెంకటేశ్ గురువారం ప్రారంభించారు. సుమారు కోటి రూపాయల వ్యయంతో అధునాతనంగా భవనాన్ని నిర్మించినట్లు మున్సిపల్ చైర్మన్ పీహెచ్ రాజేశ్, వైస్ చైర్ పర్సన్ గీతా హనుమంతరాయప్ప తెలిపారు. ముఖ్యాధికారి జాఫర్ షరీఫ్ తదితర ఉద్యోగ సిబ్బంది, కౌన్సిలర్లు మున్సిపల్ మాజీ చైర్మన్ శంకరరెడ్డి, ఎగువపల్లి నాని, హనుమంతరాయప్ప తదిరులు పాల్గొన్నారు.

వైద్యులపై దాడులు అరికట్టాలి



“ఇటీవల దేశవ్యాప్తంగా వైద్యులు, వైద్య సిబ్బందిపై దాడులు అధికమయ్యాయి. కోల్‌కతాలో ట్రైనీ వైద్యురాలిపై హత్య, అత్యాచారం ఘటన ఇందుకు పరాకాష్ట. ప్రాణాలను రక్షించే వైద్యులపై దాడులు జరిగితే ఇక ప్రజలకు వైద్యం ఎలా అందించాలి. ప్రభుత్వాలు వైద్యులు, వైద్య సిబ్బందికి రక్షణ చట్టాలు రూపొందించాలి. అభయ ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలి.

– రాము, టీబీ సూపర్‌వైజర్ ఏరియా ఆస్పత్రి మడకశిర

రాత్రి వేళల్లో భద్రత పెంచాలి



ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రాత్రి పూట సిబ్బందికి భద్రత కల్పించాలి. రాత్రిపూట ప్రమాదం కేసులు, డ్రంకెన్ కేసులు వస్తుంటాయి. ఈ పరిస్థితుల్లో మహిళా సిబ్బందికి చాలా ఇబ్బందిగా ఉంటుంది. కోల్‌కతాలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలి. వైద్యులు, వైద్యసిబ్బందిపై దాడులు అరికట్టేందుకు కఠిన చట్టాలు రూపొందించాలి.

–జ్యోతిలింగం, స్టాఫ్‌నర్సు, అమరాపురం పీహెచ్‌సీ

మాతృభాషను మరువొద్దు



లేపాక్షి మండలం కొండూరులో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



పెనుకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం



రొద్దం మండలం సానిపల్లిలో తెలుగుకవుల వేషధారణలో విద్యార్థులు

- వక్తల పిలుపు
- ఘనంగా తెలుగుభాష, జాతీయ క్రీడా దినోత్సవం
- గిడుగు రామ్మూర్తి పంతులు, ధ్యాన్‌చంద్‌కు ఘన నివాళి

హిందూపురం టౌన్: ప్రపంచంలో ఎక్కడికెళ్లిన మాతృభాషను మర్చిపోకూడదని ఎంఈఓ గంగప్ప పిలుపునిచ్చారు. గురువారం ముద్దిరెడ్డిపల్లిలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో తెలుగుభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఈఓ తెలుగు భాష ప్రాముఖ్యతను తెలియజేశారు. అనంతరం విద్యార్థినులు సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు. పట్టణంలోని కల్లూరు సుబ్బారావు మున్సిపల్ ఓరియంటల్ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా, జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో హెచ్ఎం పెన్నోబులం, కౌన్సిలర్లు అయూబ్, రమేష్, సతీష్, హెచ్ఎం గంగాధర్, ఉపాధ్యాయుడు శ్రీరామిరెడ్డి, పీడీ లోకేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి: ఏపీ గురుకుల పాఠశాల, కొండూరు, లేపాక్షి, చోళసముద్రం, పులమతి జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో గురువారం తెలుగు భాషా దినోత్సవంతో పాటు జాతీయ క్రీడా దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గిడుగు రామ్మూర్తి పంతులు, ధ్యాన్‌చంద్ చిత్రపటాలతో ర్యాలీ నిర్వహించారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయికి ఎంపికైన నిఖిత, అనితలకు మెడల్స్ అందజేశారు.

అగళి: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో గురువారం ప్రిన్సిపాల్ జాఫర్ ఆధ్వర్యంలో తెలుగు భాష, జాతీయ క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. గిడుగు రామ్మూర్తి, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు

అమరాపురం: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం తెలుగు భాషా దినోత్సవాన్ని ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. వి.అగ్రహారం ఉన్నత పాఠశాలలో ఛాయదేవి విద్యార్థి 500 పద్యాలు చెప్పడంతో తెలుగు ఉపాధ్యాయుడు నగదు బహుమతి అందజేశారు.

గుడిబండ: స్థానిక ఎంజేపీ జూనియర్ బాలికల కళాశాలలో గురువారం తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపల్ జ్యోతి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అధ్యాపకులు శివలింగప్ప, అనురాధ, ప్రమీళ పాల్గొన్నారు.

రొద్దం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, సానిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు అధ్యాపకురాలు అంజలీదేవి, ప్రిన్సిపాల్ మద్దిలేటి తెలుగు భాష గొప్పతనాన్ని వివరించారు. విద్యార్థులు వివిధ వేషధారణలతో అలరించారు.

పెనుకొండ: స్థానిక ఎంజేపీ పాఠశాల, పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, శాంతినికేతన్ ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, శ్రీ సత్యసాయి జూనియర్, డిగ్రీ కళాశాల, వెంకటరెడ్డిపల్లి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల, ప్రగతి, గ్లోబల్ జెన్ ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాలల్లో గురువారం తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. వక్తలు తెలుగు భాషా ప్రాముఖ్యతను వివరించారు.

హిందూపురం: చౌళూరు జెడ్పీ హై స్కూల్, బాలాజీ జూనియర్, డిగ్రీ కళాశాల, బాలయేసు కళాశాలలో గురువారం తెలుగుభాషా, జాతీయ క్రీడా దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు యోగా పదర్శనలతో ఆకట్టుకున్నారు. వక్తలు తెలుగుభాషా గొప్పతనాన్ని వివరించారు. జామియా ఈద్గా సర్కిల్ వద్ద టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ జాతీయ అధ్యక్షులు ఉమర్ ఫారూఖ్ ఖాన్ ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో చైతన్య గంగిరెడ్డి,అజమతుల్లా ఖాన్. జయరాం,షేక్ షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

రొళ్ల: దొమ్మరహట్టి అంబేడ్కర్ గురుగుల బాలుర రెసిడెన్షియల్ పాఠశాల, , బీజీ హళ్లి జెడ్పీహెచ్ఎస్ పాఠశాలల్లో గురువారం తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

పెనుకొండ రూరల్: గుట్టూరు జెడ్పీ హైస్కూల్‌లో గురువారం తెలుగు భాష, జాతీయ క్రీడా దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం నాగార్జునుడు విద్యార్థులకు తెలుగు భాషపై వ్యాసరచన పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం అంతర్జాతీయ బాస్కెట్ బాల్ రెఫరీగా అర్హత సాధించిన పాఠశాల పీఈటీ వెంకటేష్‌ను ఘనంగా సన్మానించారు.

మడకశిరరూరల్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలతోపాటు కదిరేపల్లి సెయింట్ ఆన్స్ పాఠశాలలో గురువారం తెలుగు ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో తెలుగుభాష దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాతృభాషాభివృద్ధికి గిడుగు రామ్మూర్తి పంతులు చేసిన కృషిని కొనియాడారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమాల్లో హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



రొళ్ల మండలం దొమ్మరహట్టిలో గిడుగు రామ్మూర్తికి నివాళులర్పిస్తున్న దృశ్యం



హిందూపురం టౌన్: ఓరియంటల్ పాఠశాలలో విద్యార్థుల నృత్య ప్రదర్శన



అమరాపురం మండలం వి.అగ్రహారంలో విద్యార్థినికి బహుమతి ఇస్తున్న దృశ్యం



గుడిబండలో గిడుగు రామ్మూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంజేపీ ప్రిన్సిపాల్ జ్యోతి



చౌళూరు హైస్కూల్‌లో విద్యార్థుల యోగా విన్యాసం

ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం



ఖైదీలతో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న జడ్జి శ్రీధర్

హిందూపురం: ఆర్థిక స్తోమత లేని ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం అందిస్తామని సీనియర్ సివిల్ జడ్జి మానిపాటి శ్రీధర్ అన్నారు. గురువారం ఆయన స్థానిక సబ్‌జైలును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జడ్జి ఏఏ కేసుల్లో నిందితులుగా ఉన్నారు, ఎన్నాళ్లుగా ఉంటున్నారనే విషయాలను ఖైదీలతో అడిగి తెలుసుకున్నారు. సబ్ జైలులో సౌకర్యాలపై ఆరాతీశారు. ఏమైనా సమస్యలుంటే తెలియజేయాలని వారికి సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చాలాకాలంగా శిక్ష అనుభవిస్తున్న ఖైదీల్లో అర్హత ఉన్నవారికి ప్రభుత్వం న్యాయవాదిని సమకూర్చి బెయిల్ సదుపాయం కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో సబ్ జైలు సూపరింటెండెంట్ అంజి నాయక్, న్యాయవాదులు సంతోషికుమారి, రత్న కుమార్, భాగ్యలక్ష్మి, లోక్ అదాలత్ సిబ్బంది శారద తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు పరామర్శ



వైఎస్సార్‌సీపీ నాయకులను పరామర్శిస్తున్న ఈరలక్కప్ప

మడకశిర: అనారోగ్యంతో బాధపడుతున్న పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రంగేగౌడ్ కుటుంబ సభ్యులను గురువారం ఆ పార్టీ సమన్వయకర్త ఈరలక్కప్ప పరామర్శించారు. ఈసందర్భంగా ఆయన వారి ఆరోగ్యపరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

రాయితీపై ఉలవలు

లేపాక్షి/ చిలమత్తూరు: ఖరీఫ్‌లో సాగు చేసేందుకు రైతులకు 80 శాతం సబ్సిడీతో ఉలవ విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు లేపాక్షి, చిలమత్తూరు ఏఓలు శ్రీలత, వంశీకృష్ణ తెలిపారు. 10 కిలోల బ్యాగు రూ.870 కాగా ప్రభుత్వం రూ.696 సబ్సిడీ ఇస్తుందని రైతు రూ.174 చెల్లించాలన్నారు. పంట సాగు చేయని రైతులు ఆయా రైతు సేవా కేంద్రాల ద్వారా విత్తనాలు తీసుకోవాలని సూచించారు. ఖరీఫ్‌లో పంటలు సాగు చేసిన రైతులు తప్పనిసరిగా ఈ–క్రాప్ నమోదు చేయించుకోవాలని సూచించారు.

ప్రతికూల ఆలోచనలు విడనాడండి



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న కళాశాల చైర్మన్ చంద్రమోహన్

హిందూపురం: విద్యార్థులు ప్రతికూల ఆలోచనలు విడనాడి కరీర్‌పై దృష్టి సారించాలని బిట్ కళాశాల చైర్మన్ చంద్రమోహన్ సూచించారు. బిట్ కళాశాలలో డిప్లొమా కొత్త బ్యాచ్ విద్యార్థులకు గురువారం ఓరియటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వనరులను సమర్థవంతంగా ఉపయోగించుకోవాలన్నారు. జేఎన్‌టీయూ ఎవాల్యుయేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ నాగప్రసాద్‌నాయుడు మాట్లాడుతూ ఉద్యోగ ప్రపంచంలో డిప్లొమా గ్రాడ్యుయేట్లకు పుష్కలంగా అవకాశాలు ఉన్నాయన్నారు. హిందూపురం ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ హరీష్ బాబు మాట్లాడుతూ ఉద్యోగ అవకాశాలను చేజిక్కించుకునేలా కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో బిట్ కళాశాల ప్రిన్సిపాల్ రమేష్‌బాబు, హెచ్ఓడీ దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన పాఠశాలలో వైద్యశిబిరం



విద్యార్థులకు ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య సిబ్బంది

గోరంట్ల: స్థానిక గిరిజన బాలికల సంక్షేమ పాఠశాలలో డాక్టర్ శృతి ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ శృతి విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందించారు. సీహెచ్ఓ గాయత్రి విద్యార్థులకు ఆరోగ్యసూత్రాలు తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ విజయకుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రణాళికలు రూపొందించండి

రొళ్ల: మండలాభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని ఇండస్ట్రియల్ డైరెక్టర్, స్పెషల్ ఆఫీసర్ మాబూబ్‌బాషా అధికారులకు సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో వికసిత్ ఏపీపై సమావేశం నిర్వహించారు.

ఎంఈఓకు సన్మానం

రొద్దం: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ అవార్డు పొందిన ఎంఈఓ ఆంజనేయులు నాయక్‌ను గురువారం స్థానిక ఎమ్మార్సీ భవనంలో ఏపీటీఎఫ్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా వక్తలు ఎంఈఓ సేవలను కొనియాడారు. ఏపీటీఎఫ్ నేత మల్లికార్జున, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి ఇంటి వద్ద బందోబస్తు

పెనుకొండ: పట్టణంలోని మాజీ మంత్రి శంకరనారాయణ ఇంటి వద్ద గురువారం పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి వర్గానికి చెందిన కొందరు మహిళలు గురువారం మాజీ మంత్రి ఇంటి వద్ద ధర్నా చేయనున్నట్లు సమాచారం అందడంతో పోలీసు అధికారులు ముందుస్తు చర్యలు తీసుకున్నారు.

జాబ్‌మేళాకు స్పందన



ఉద్యోగాలకు ఎంపికైన నిరుద్యోగులు

పెనుకొండ: పట్టణంలోని శ్రీసత్యసాయి డిగ్రీ కళాశాలలో గురువారం జరిగిన జాబ్ మేళాకు స్పందన లభించింది. కొడికొండ చెక్‌పోస్ట్ లోని దివ్యాంగుల సంస్థ ఆధ్వర్యంలో బార్క్లే లస్ సహకారంతో జరిగిన జాబ్ మేళాకు 200 మంది హాజరుకాగా 169 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రిన్సిపాల్ ఆదిశేషారెడ్డి, తహసీల్దార్ శ్రీధర్, ఎస్ఐ. రాజేష్, సమర్థనం ట్రస్ట్ సెంటర్ హెడ్ వెంకటేశ్వర్లు ప్లేస్మెంట్ ఆఫీసర్ వీరభద్ర, ఏఓ కేశవయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుద్యోగ యువత జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ అశోక్, కవిత, నరసింహులు, ఎర్రిస్వామి, వెంకటేష్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మొక్కలు నాటే కార్యక్రమం

మడకశిర: మడకశిర మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం వనం–మనం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు కమిషనర్ రంగస్వామి తెలిపారు. ఉదయం 10.30 గంటలకు మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్యక్రమాన్ని ప్రారంభిస్తామన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్, వైస్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు హాజరు కావాలని కోరారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని వడ్డించండి



రొళ్ల గురుకుల పాఠశాలలో విద్యార్థులతో మొక్కలు నాటిస్తున్న ఎంఈఓ శ్రీధర్

రొళ్ల: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని వడ్డించాలని ఎంఈఓ శ్రీధర్ ఎండీఎం నిర్వాహకులను ఆదేశించారు. గురువారం స్థానిక జెడ్పీహెచ్ఎస్, గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల్లో రికార్డులు, విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించారు. గురుకుల పాఠశాలలో పీఎంశ్రీ కింద మంజూరైన భవనాన్ని పరిశీలించారు. తర్వాత పాఠశాల ఆవరణలో విద్యార్థులతో మొక్కలు నాటించారు. మొక్కలు పెంపకంతో కాలుష్యాన్ని నియంత్రించడంతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఎండీఎం నిర్వహకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్త బస్సులు కేటాయించాలని మంత్రికి వినతి

మడకశిర: మడకశిర ఆర్టీసీ డిపోకు కొత్త బస్సులు కేటాయించాలని కోరుతూ గురువారం విజయవాడలో రవాణాశాఖ మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డిని కలిసి వినతిపత్రాన్ని అందించినట్లు స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 30 కొత్త బస్సులు కేటాయించాలని కోరినట్లు తెలిపారు. అలాగే శ్రీసత్యసాయి జిల్లాలో 17 మండలాలకు మాత్రమే రెగ్యులర్ తహసీల్దార్లు ఉన్నారని, మిగిలిన మండలాలకు రెగ్యులర్ తహసీల్దార్లను నియమించాలని రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను కలిసి కోరినట్లు ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు పేర్కొన్నారు.

టీడీపీ నేతల బెదిరింపులకు భయపడొద్దు

- మాజీ మంత్రి ఉషశ్రీచరణ్




బీచిగానిపల్లిలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్

పరిగి: టీడీపీ నాయకుల బెదిరింపులకు భయపడొద్దని ఆపద సమయాల్లో ఒక్క ఫోన్ కాల్‌తో తాను ముందుండి న్యాయం జరిగేవరకూ పోరాడుతానని వైఎస్సార్‌సీపీ శ్రేణులకు మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్ భరోసా కల్పించారు. గురువారం ఆమె బీచిగానిపల్లి పంచాయతీలోని గొల్లపల్లి, అనంతరం ఊటుకూరు, ఎర్రగుంట గ్రామ పంచాయతీల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో సంగమేశ్వరం పల్లిలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడులు అధికమయ్యాయన్నారు. పెనుకొండ నియోజకవర్గంలో మంత్రి సవిత కుట్రల, కుతంత్రాలతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. రెండున్నర నెలలు దాటినా ఎన్నికల హామీలను అమలుచేయడం లేదని విమర్శించారు.

టీడీపీ వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్దాం

టీడీపీ వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళదామని మాజీమంత్రి ఉషశ్రీ చరణ్ వైఎస్సార్‌సీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సుఖాలలో కాకుండా కష్టకాలంలో పార్టీని నడిపించడానికి కష్టపడే ప్రతి వ్యక్తినీ పార్టీ గుర్తిస్తుందని హామీ ఇచ్చారు. గత 2014 ఎన్నికలలో మాయ మాటలతో అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వాన్ని ప్రజలు నమ్మినట్లే 2024లో సైతం మరోసారి మోసపోయారన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నరసింహమూర్తి, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి డీవీ రమణ, సర్పంచ్ దిలీప్‌కుమార్, ఎంపీటీసీ అమరావతి, మాజీ కన్వీనర్ జయరాం తదితరులు పాల్గొన్నారు. అనంతరం శాసనకోటలో మాజీ సర్పంచ్ శీనప్పను పరామర్శించారు.

రికార్డులు సక్రమంగా నిర్వహించాలి



సీడీపీఓను సన్మానిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

అమరాపురం: అంగన్‌వాడీ కేంద్రాల్లో రికార్డులను సక్రమంగా రాయాలని సీడీపీఓ పద్మావతి సిబ్బందికి సూచించారు. గురువారం స్థానిక ఆర్టీటీ కమ్యూనిటీ భవనంలో మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ ప్రీ స్కూల్ పిల్లలకు ఆటలతో కూడిన విద్య నేర్పాలన్నారు. మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. అనంతరం సెక్టార్‌ల వారీగా రికార్డులను పరిశీలించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ అవార్డు తీసుకున్న సీడీపీఓను అంగన్‌వాడీ కార్యకర్తలు పూలమాలలు, శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కమలమ్మ పాల్గొన్నారు.

ఎయిడ్స్ నివారణపై అవగాహన



ఎయిడ్స్ పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

గోరంట్ల: బూడిదగడ్డపల్లి గ్రామంలో గురువారం శ్రీసత్యసాయి జిల్లా ఎయిడ్స్ నియంత్రణమండలి ఆధ్వర్యంలో చైల్డ్‌ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీమ్ ప్రతినిధులు ప్రజలకు ఎయిడ్స్ నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జోనల్ సూపర్‌వైజర్ వెంకట్ హెచ్ఐవీ ఎలా సోకుతుంది, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. కార్యక్రమంలో గోరంట్ల ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ వాసుతో పాటు చైల్డ్ ఫండ్ ఇండియా, లింక్ వర్కర్ స్కీమ్ ప్రతినిధులు, గ్రామ మహిళ మండలి సభ్యులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.